క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతు పనుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని కింద తెలిపిన ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డీఈ హన్మంత్‌రెడ్డి తెలిపారు.

- ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 వరకు...
- సలీంనగర్ మిల్క్‌బూత్, రేస్‌కోర్స్, శ్రీపురం కాలనీ, డెక్కన్ టవర్స్ పరిసర ప్రాంతాలు.
- మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు...

ప్రశాంత్‌నగర్, ఆర్‌టీఏ ఆఫీస్, ఈస్ట్ అండ్ వెస్ట్ ప్రశాంత్‌నగర్, శ్రీపురం కమ్యూనిటీహాల్, నాగదేవాలయం పరిసర ప్రాంతాల్లో కరెంట్ ఉండదని ఆయన పేర్కొన్నారు.

ప్రభుత్వ స్థలంలో గుడిసెల తొలగింపు

నాగోలు: ప్రభుత్వ స్థలంలో వేసిన గుడిసెలను ఉప్పల్ మండల రెవెన్యూ అధికారులు మంగళవారం తొలగించారు. నాగోలు డివిజన్ పరిధిలోని బండ్లగూడ సర్వేనెంబర్ 36/6లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలంలో నాగోలు పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసేందుకు అధికారులు సన్నాహాలు చేపట్టారు. అయితే సదరు స్థలంలో నాగోలు డివిజన్ పరిధిలోని వివిధ బస్తీలకు చెందిన నిరుపేదలు ఆదివారం గుడిసెలు వేసుకున్నారు. దీనిపై సమాచారం అందడంతో ఉప్పల్ మండల రెవెన్యూ అధికారులు అక్రమంగా నిర్మించిన గుడిసెలను, పరదాలను తొలగించారు. ఎవరైనా ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి



చాదర్‌ఘాట్: నియోజకవర్గ పరిధిలోని దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తున్నామని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఓల్డ మలక్‌పేట డివిజన్‌కు చెందిన దివ్యాంగ బాలిక ఖదీజాకు మంజూరైన ఎలక్ట్రిక్ వీల్ ఛైర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దివ్యాంగులందరికీ అవసరమైన పరికరాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఓల్డ్ మలక్‌పేట డివిజన్ ఎంఐఎం అధ్యక్షుడు షఫీయుద్దీన్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

ఎల్‌బీనగర్: కాలనీల అభివృద్ధిలో సంక్షేమ సంఘాలు భాగస్వాములు కావాలని బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు .డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర కాలనీ నూతన సంక్షేమ సంఘ సభ్యులు మంగళవారం కార్పొరేటర్ లచ్చిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం కాలనీలో నెలకొన్న సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు కృష్ణ, ప్రధాన కార్యదర్శి చారి, ఉపాధ్యక్షులు జంగయ్యగౌడ్, సభ్యులు వెంకటేష్, పురుషోత్తం, రామాచారి, చందు, యాదయ్య, బిక్షమయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి- కేసు నమోదు

హస్తినాపురం: కాలనీ సమస్యలను పరిష్కరించకుండా కాలనీ సంక్షేమ సంఘం పేరుతో డబ్బులు ఎందుకు వసూలు చేస్తున్నారని నిలదీసినందుకు ఓ వ్యక్తిపై దాడి చేసి గాయపరిచిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వనస్థలిపురం పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పోలీస్‌స్టేషన్ పరిధిలోని సామనగర్ సీబీఐకాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ముప్వ సతీష్ కాలనీలో ఇష్టానుసారంగా డబ్బులు వసూలు చేస్తున్నాడని అదే కాలనీకి చెందిన రంగరాజు అందరి సమక్షంలో నిలదీశాడు. దీంతో ఆగ్రహానికిలోనైన సతీష్ అతడిపై దాడి చేయడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు వనస్థలిపురం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే నీటి సరఫరాలో ఇబ్బందులు

హయత్‌నగర్: నాలా నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగానే మంచి నీటి పైపులు పగిలిపోతున్నాయని, దీంతో పలు కాలనీలకు మంచినీటి సరఫరా నిలిచిపోతోందని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం ఆయన డివిజన్ పరిధిలోని తొర్రూర్ రోడ్డులో జరుగుతున్న నాలా నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... నాలా నిర్మాణ పనులు నెమ్మదిగా జరుగుతున్నాయని, పనుల్లో నాణ్యత పాటించడం లేదని ఆరోపించారు. ఇష్టానుసారంగా తవ్వకాలు జరపడంతో భూమి లోపల ఉన్న మంచి నీటి పైపులు పగిలిపోయాయన్నారు. ఈ కారణంగా పలు కాలనీలకు నాలుగురోజులుగా నీటి సరఫరా నిలిచిపోయిందన్నారు. కాంట్రాక్టర్ వెంటనే పైపులైన్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

చెత్త కుప్పలు.. ఎండిన మొక్కలు



- అస్తవ్యస్తంగా సెంట్రల్ కాలనీ పార్కు నిర్వహణ
- పట్టించుకోని అధికారులు
- కానరాని పచ్చదనం

హస్తినాపురం: ఎల్‌బీనగర్ సర్కిల్, హస్తినాపురం డివిజన్ పరిధిలోని హస్తినాపురం సెంట్రల్ కాలనీ పార్కు నిర్వహణ కరువై నిరుపయోగంగా మారింది. స్థానికులు పార్కులో చెత్తను పారబోస్తుండటంతో డంపింగ్ యార్డును తలపిస్తోంది. గత కొన్ని నెలలుగా పార్కులో మొక్కలు ఎండిపోయి పార్కు ఆనవాళ్లు లేకుండా పోయాయి. అయితే సంబంధిత అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడక పోవడం గమనార్హం. ఈ పార్కు హస్తినాపురం సెంట్రల్ కాలనీ, గోకుల్‌ఎన్‌క్లేవ్ కాలనీల సరిహద్దులో ఉండడంతో పార్కు అభివృద్ధిని ఆయా కాలనీ సంఘాలు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. పార్కులో నిరుపయోగంగా ఉన్న సిమెంట్ పైపులను వేయడంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. పార్కులో చెట్లు ఎండిపోయినా పట్టించుకునే నాథుడు కరువయ్యాడని ఆయా కాలనీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్కును అభివృద్ధి చేయాలని అధికారులకు పలు మార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని పార్కును అన్ని విధాల అభివృద్ధి చేయాలని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు.

పచ్చదనాన్ని పెంపొందించాలి



హస్తినాపురం సెంట్రల్‌కాలనీ పార్కులో పచ్చదనం ఆనవాళ్లు లేకుండా పోయాయి. వెంటనే ఈ పార్కులో మొక్కలు నాటించి పచ్చదనాన్ని పెంపొందించాలి. గత కొన్ని నెలలుగా పార్కును ఎవరూ పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారింది. అధికారులు స్పందించి పార్కును అన్ని విధాల అభివృద్ధి చేయాలి.

–డాక్టర్ సాదం ఐలయ్య–హస్తినాపురం

సిమెంటు పైపులు తొలగించాలి...



గోకుల్‌ఎన్‌క్లేవ్ కాలనీ, హస్తినాపురం సెంట్రల్ కాలనీల సరిహద్దులో పార్కు ఉండడంతో ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో ఆ ప్రాంతంలో నిరుపయోగంగా ఉన్న సిమెంటు పైపులను వేశారు. దీంతో పార్కులోకి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. పైపుల కింద పాములు, విషపురుగులు చేరడంతో అందులోకి వెళ్లాలంటేనే ప్రజలు జంకుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పార్కులో ఉన్న సిమెంటు పైపులను తొలగించాలి.

–చెన్నోజు శ్రీనివాసులు–హస్తినాపురం

ఉపాధ్యాయుల సంక్షేమమే ధ్యేయం



ఉపాధ్యాయులతో పీఆర్‌టీయూ నేతలు

చంపాపేట: ప్రభుత్వ ఉపాధ్యాయుల సంక్షేమమే పీఆర్‌టీయూ టీఎస్ ధ్యేయమని పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు పింగళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఆయన చంపాపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఉపాధ్యాయులందరికీ హెల్త్ కార్డులు ఇప్పిస్తామన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టుల భర్తీ, అర్హులైన ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు చేపట్టేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పీఆర్‌టీయూ మద్దతుతో ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎన్నికల బరిలో ఉన్న గుర్రం చెన్నకేశవరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు గోవర్ధన్ యాదవ్, సామల మహేందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, నారాయణగౌడ్, నరసింహారెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, నవీన్‌కుమార్, మధుసూదన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విహారయాత్రకు వెళ్లిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి

- బాలిలో నీటిలో మునిగి గల్లంతు
- మెయిన్స్‌కు అర్హత సాధించిన వంశీకృష్ణ
- కన్నీరుమున్నీరవుతున్న కుటుంబ సభ్యులు



వంశీకృష్ణ (ఫైల్)

నాగోలు: భార్యతో కలిసి విహార యాత్రకు వెళ్లి సముద్రంలో మునిగి నగరానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..నాగోలు డివిజన్ బండ్లగూడ అజయ్‌నగర్‌లో నివాసం ఉండే రాముని రవీందర్ చిన్న కుమారుడు వంశీకృష్ణ (27) సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. మరో పక్క గ్రూప్–1 ఫలితాల్లో మెయిన్స్ అర్హత సాధించాడు. గతేడాది జూన్ 23న కర్మన్‌ఘాట్‌కు చెందిన యువతితో వివాహమైంది. ఈ నెల 13న భార్య, ఇతర బంధువులతో కలిసి మలేసియా, ఇండోనేసియాలకు విహార యాత్రకు వెళ్లారు. మొదట మలేసియా యాత్ర పూర్తయిన తరువాత ఇండోనేసియాలోని బాలికి వెళ్లారు. ఈ నెల 22న ఆదివారం వంశీకృష్ణ బాలిలో సముద్ర గర్భంలోని అక్వేరియం సందర్శించేందుకు ఒంటరిగా వెళ్లాడు. అతను సముద్రంలోకి వెళ్లే సమయంలో అక్కడి నిర్వాహకులు సూచించిన ప్రకారం కాళ్లకు చెప్పులు, ఆక్సిజన్ సిలిండర్ ధరించి వెళ్లాడు. కానీ వంశీకృష్ణ సముద్రంలోకి దిగి గల్లంతయ్యాడు. భార్య అతని రాక కోసం చాలాసేపు ఎదురు చూసినా పైకి రాలేదు. దీంతో సముద్రంలో గల్లంతైనట్లు భావించి అక్కడి నిర్వాహకులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడి పోలీసులు సముద్రంలో గాలించి వంశీకృష్ణ మృతదేహాన్ని బయటకు తీశారు. అతను అప్పటికే మృతి చెందినట్లు పోలీసులు నిర్ధారించారు. నగరంలో ఉన్న కుటుంబ సభ్యులకు సమాచారం అందడంతో వారు మంగళవారం ఉదయం బాలికి బయలుదేరి వెళ్లారు. అక్కడ పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని శుక్రవారం నగరానికి తీసుకొచ్చే అవకాశం ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. సముద్రంలో గల్లంతైన వంశీకృష్ణ నీటిలోకి వెళ్లాక భయపడడంతో గుండెపోటుతో మృతి చెందాడని అక్కడ పోలీసులు ప్రాథమిక సమాచారం ఇచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

కరువు భత్యం విడుదలపై పెన్షనర్ల జేఏసీ హర్షం

వనస్థలిపురం: పెన్షనర్ల ఇబ్బందులను గుర్తించి ప్రభుత్వం ఒక విడత కరువు భత్యాన్ని విడుదల చేస్తూ జీవో (ఎంఎస్.నం.10) విడుదల చేయడంపై తెలంగాణ ప్రభుత్వానికి, సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల జేఏసీ సభ్యులు పేర్కొన్నారు. మంగళవారం వనస్థలిపురంలో జేఏసీ చైర్మన్ కే.లక్ష్మయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు. ఇంకా మూడు విడతల డియర్నెస్ రిలీఫ్ (పెన్షనర్లకు ఇచ్చే కరువు భత్యం) ప్రభుత్వం నుంచి అందాల్సి ఉందని, ఆ మూడు విడతల కరువు భత్యాన్ని ఉగాది పండుగ సందర్భంగా మార్చి నెలలో విడుదల చేయాలని కోరారు. సమావేశంలో జేఏసీ కో–చైర్మన్లు ఎం.సూర్యనారాయణ, కృష్ణమూర్తి, ఏ.రాజేంద్రబాబు, ఎం.భరత్‌రెడ్డి, సెక్రెటరి జనరల్ టి.సుభాకరరావు, వైస్ చైర్మన్ ఎస్.జ్ఞానేశ్వర్, కోశాధికారి కృష్ణప్రసాద్, కార్యదర్శులు నరసింగరావు, సత్యనారాయణ పాల్గొన్నారు

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

దిల్‌సుఖ్‌నగర్: పేదల జీవితాల్లో వెలుగు నింపేందుకే పైసా ఖర్చు లేకుండా కంటి పరీక్షలు చేయిస్తున్న వ్యక్తి ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక్కరేనని రాష్ట్ర గ్రంథాలయాల సంస్థ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, బీఆర్‌ఎస్ నాయకులు మురుకుంట్ల అరవింద్, పెండ్యాల నగేష్ అన్నారు. మంగళవారం ఆర్‌కేపురం డివిజన్ శ్రీకృష్ణనగర్ కమ్యూనిటీ హాల్‌లో కొనసాగుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని కంటి జబ్బులతో బాధపడుతున్న వారందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి నేతృత్వంలో నియోజకవర్గ పరిధిలో విజయవంతంగా ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు వెంకట్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కంచర్ల శేఖర్ కొండ శ్రీనివాస్, పెంబర్తి శ్రీనివాస్, జగన్మోహన్ రెడ్డి, అల్లావుద్దీన్ పటేల్ , ఫరీద్ పాషా, దుబ్బాక శేఖర్, మహమ్మద్ షఫీ, పదిల శంకర్, శ్రీనివాస్ గుప్తా మురళీధర్ రెడ్డి, వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా మార్కండేయ జయంతి



శ్రీ శివ మార్కండేయ దేవాలయంలో పూజలు

వనస్థలిపురం: వనస్థలిపురంలోని శ్రీ శివ మార్కండేయ దేవాలయంలో పద్మశాలి వంశ మూల పురుషులు భగవాన్ శ్రీ మార్కండేయ జయంతి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మ్యాన సత్యనారాయణ, కోశాధికారి రచ్చ లక్ష్మయ్య, మురళి, తిరుపతయ్య, బిక్షమయ్య, మహదేవ్, పెద్ద సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ మానవ హక్కుల రక్షణ మండలి తెలంగాణ ఇన్‌చార్జిగా పుష్పలత

మన్సూరాబాద్: అంతర్జాతీయ మానవ హక్కుల రక్షణ మండలి సంస్థ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జిగా ఎల్‌బీనగర్‌కు చెందిన వేముల పుష్పలత నియమితులయ్యారు. ఈ మేరకు సంస్థ వైస్ ప్రసిడెంట్ షేక్ నజీర్ అహ్మద్, డైరెక్టర్ కల్లెపల్లి జాన్‌వెస్లీ మంగళవారం ఆమెకు నియామక పత్రాన్ని, ఐడెంటిటీ కార్డును అందజేశారు. ఈ సందర్భంగా పుష్పలత మాట్లాడుతూ మానవ హక్కుల ఉల్లంఘనలపై ప్రజలను చైతన్యం చేస్తానన్నారు. సంస్థ సిద్ధాంతాలకు కట్టుబడి, సంస్థ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

పేదలకు బ్లాంకెట్ల పంపిణీ

మన్సూరాబాద్: రోడ్లపై నిద్రిస్తున్న పేదలు, వృద్ధులకు గిన్నిస్‌బుక్ రికార్డ్ హోల్డర్ (4 టైమ్స్), రచయిత, సామాజిక కార్యకర్త డాక్టర్ పెండెం కృష్ణకుమార్ సోమవారం రాత్రి ఉచితంగా బ్లాంకెట్లను పంపిణీ చేశారు. మన్సూరాబాద్, నాగోలు, దిల్‌సుఖ్‌నగర్, కొత్తపేట ప్రాంతాల్లో బ్లాంకెట్లను పంపిణీ చేశారు.



బ్లాంకెట్లను పంపిణీ చేస్తున్న డాక్టర్ పెండెం కృష్ణకుమార్

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

నాగోలు: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఎల్‌బీనగర్ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నాగోలు, జైపురికాలనీ, బ్లెండ్స్ కాలనీకి చెందిన పవన్(42) ఐస్‌క్రీమ్‌లు అమ్మడంతో పాటు జొమాటో, స్విగ్గిలో పనిచేసేవాడు. అయితే సరిపడ ఆదాయం లేకపోవడంతో కుటుంబ పోషణ నిమిత్తం పలువురి వద్ద అప్పులు చేశాడు. కొత్తగా బైక్ కొన్న అతను కిస్తీలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నాడు. అప్పుదారుల నుంచి ఒత్తిడి పెరగడంతో మనోవేదనకు గురయ్యాడు. మంగళవారం సాయంత్రం అతడి భార్య పూనమ్ స్కూల్ నుంచి పిల్లలను తీసుకుని ఇంటికి వచ్చే సరికి పవన్ రేకుల షెడ్డుకు చున్నీతో ఉరివేసుకుని కనిపించాడు. స్థానికులు అక్కడికి చేరుకుని పవన్‌ను కించి చూడగా అప్పటికే అతను మృతి చెందాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగానే తన భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుడి భార్య పూనమ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎల్‌బీనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా హాస్పిటల్‌కు తరలించారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికితీయాలి



కరాటే శిక్షణ ప్రారంభోత్సవంలో పాల్గొన్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి, డిప్యూటీ ఈఓ రాధాకృష్ణ

మలక్‌పేట: పిల్లల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీసి వారిని ప్రోత్సహించాలని మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి అన్నారు. జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా శాలివాహననగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సంజీవయ్యనగర్ బాగ్‌మూసారిమో హైస్కూల్‌లో మంగళవారం ఎగ్జామ్ వారియర్ ఆర్ట్ కాంపిటీషన్ నిర్వహించారు. సైదాబాద్ మండల డిప్యూటీ ఈఓ తిరునగరి రాధాకృష్ణతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతి స్కూల్‌కు బాలికల ఆత్మ సంరక్షణ శిక్షణకు రూ. 5 వేలు మంజూరు చేసిందన్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థినులకు కరాటే శిక్షణ తరగతులు ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఐవో విష్ణు, శాలివాహననగర్ హెచ్‌ఎం కనకవల్లి, ఇన్‌చార్జి మన్నన్, కరాటే మాస్టర్ విక్కీ, టీచర్లు రాజు, శివశాంతి తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి



దిల్‌సుఖ్‌నగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఏబీవీపీ నాయకులు

మలక్‌పేట: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్స్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఏబీవీపీ దిల్‌సుఖ్‌నగర్ కమిటీ ఆధ్వర్యంలో ప్ల కార్డులతో ర్యాలీ చేపట్టారు. గడ్డిఅన్నారం చౌరస్తా నుంచి దిల్‌సుఖ్‌నగర్ వరకు ర్యాలీగా వెళ్లి మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా కన్వీనర్ కుంచాల సాయిరామ్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతుందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో ఫీజులు కట్టలేక పేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల పక్షాన నిలబడి సమస్యల పరిష్కారానికి పోరాడతామన్నారు. కార్యక్రమంలో నాయకులు హనుమాన్‌చారి, అభి, మధు, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణరవీందర్‌రెడ్డి

సైదాబాద్: డివిజన్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆమె జీహెచ్‌ఎంసీ అధికారులు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి జీవీ కాలనీలో నిర్మాణంలో ఉన్న సీసీరోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, సైదాబాద్‌లోని ప్రధాన రహదారులతో పాటు కాలనీలలోని అంతర్గత రహదారులను సైతం ఆధునికీకరిస్తామన్నారు. తమ ప్రాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను స్థానికులు తరుచూ పర్యవేక్షిస్తుండాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ వెంకన్న, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, కృష్ణమురళి, రాజేశ్వరరావు, నాగేశ్వరరావు, రాజ్‌కుమార్, వెంకటరావు, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చైతన్యపురి పీఎస్ పరిశీలన



చైతన్యపురి పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన సీపీ డీఎస్ చౌహాన్

చైతన్యపురి: రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్ మంగళవారం చైతన్యపురి పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్ పరిధిలో నమోదయ్యే కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. రిసెప్షన్, ఇ–క్యాప్స్ ఇతర సిబ్బందిని వారి విధులను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. స్టేషన్‌కు సంబందించిన వివరాలను ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ కమిషనర్‌కు వివరించారు. కార్యక్రమంలో డీసీపీ సన్‌ప్రీత్ సింగ్, ఏసీపీ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల కేసులో నిందితుడికి జైలు



నిందితుడు రంజిత్ రామన్

రంగారెడ్డిజిల్లా కోర్టులు: లైంగిక వేధింపుల కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష, రూ. 5,000 జరిమానా విధిస్తూ 1వ అదనపు జిల్లా, మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఆర్. తిరుపతి మంగళవారం తీర్పు చెప్పారు. ఏసీపీ కొంగర రాజి రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కొత్తపేటలో ఓ కుటుంబం పరుపుల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. బాధితురాలి కుటుంబ సభ్యులు 2014 ఏప్రిల్ నెలలో తమ ఇద్దరు కుమార్తెలను తమ దుకాణం వద్ద వదిలి పెద్ద కుమార్తెను 10 తరగతి పరీక్షలు రాయించేందుకు తీసుకెళ్లారు. అదే అదనుగా పక్క షాపులో పనిచేస్తున్న రంజిత్ రామన్(24) బాధితురాలిని తన షాపులోకి తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడు. బాధితురాలు ఈ విషయాన్ని తన తల్లికి చెప్పడంతో ఆమె చైతన్యపురి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన చైతన్యపురి పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన న్యాయస్థానం నిందితుడికి పై విధంగా శిక్ష విధిస్తూ మంగళవారం తీర్పు వెలువరించింది.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



సైదాబాద్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం సైదాబాద్ డివిజన్ మహిళాభవన్‌లో ఏర్పాటు చేసిన రెండో విడత కంటి వెలుగు కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. కంటి పరీక్షలు చేయించుకున్న పలువురికి కంటి అద్దాలు అందజేశారు.

ఆలయ ముఖద్వారానికి విరాళం



చెక్కు అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

నాగోలు: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ ముఖద్వార నిర్మాణానికి ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు, తెలంగాణ టూరిజం కార్పొరేషన్ డెవలప్‌మెంట్ బోర్డు చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా రూ. 1.50 లక్షలు విరాళంగా అందజేశారు. ఈ మేరకు మంగళవారం తన నివాసంలో ఐవీఎఫ్ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు విశ్వనాథుల మహేష్ గుప్తా, వాసవి ఇంటర్నేషనల్ అంతర్జాతీయ మాజీ మాజీ అధ్యక్షుడు యాద నాగేశ్వరరావు గుప్తాలకు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో కామారెడ్డి పట్టణ అధ్యక్షుడు మోటూరి శ్రీకాంత్ గుప్తా, ప్రధాన కార్యదర్శి మొగిలిపల్లి భూమేష్ గుప్తా, డాక్టర్ బాలు, అడ్లూర్ ఎల్లారెడ్డి, చింతల లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

పుస్తె, మెట్టెల అందజేత..

ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేద యువతి వివాహానికి మంగళ సూత్రం, మెట్టెలు, చీర, గాజులను మంగళవారం తన నివాసంలో ఉప్పల శ్రీనివాస్‌గుప్త అందజేశారు. నల్లగొండ జిల్లా, కేశరాజుపల్లి గ్రామానికి చెందిన లింగంపల్లి సైదులు కుమార్తె శ్రీజ పెళ్లికి ఆర్థికసాయం చేయాలని కోరడంతో ఆయన వారికి పుస్తె, మెట్టెలు, చీర, గాజులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు యాదా నాగేశ్వర్‌రావు, మహేష్‌గుప్త, బాలు గుప్త, శ్రీకాంత్, మొగిళ్లపల్లి భూపేష్, లక్ష్మిపతి, త్రినాథ్‌రావు తదితరులు పాల్గొన్నారు.